సుప్రసిద్ధ ఆసియా కథలు

# పాడుబడిన నుయ్యి

లిండా టి. కాస్పర్

[ఈ కథలో మూలభాషలోని మాటలు కొన్ని అలాగే ఉంచబడ్డాయి: 'మబోలో' (చెట్టు దినుసు) 'కారబో' (దున్నపోతు) మొదలయినవి. సందర్భాన్నిబట్టి అర్థం గ్రహించవచ్చు.]

పరుల వశం అయిపోయిన ఆ పొలం అంతా నడిచి చూశాడు మాంగ్ అగుస్తో. ప్రతి అడుగు అతి ప్రయాసతోనే వేశాడు. ఎండ తీక్షణానికి కళ్లు నొప్పి పుట్టాయి, అతనికి. భుజాలు వంగిపోయాయి; నడుమూ, మోకాళ్లూ కూడా వంగిపోయాయి. అతని అరవై సంవత్సరాల దేహంలోకి ప్రతి సంవత్సరం వేడి ఇంకిపోయినట్లుంది.

ఈ పొలం తనకి వంశ పరంపరలో రాతమనుసే వేసిన 'మబోలో', మామిడిచెట్ల తోపుల అవతల మరికొన్ని వరసలు పాములాగ పచ్చగా మెరుస్తున్నాయి. పొలాలగట్ల తర్వాత నేల కుంగిపోయి నదిలోకి ఒరిగిపోయింది. కాలిబాటకి అరిగి, ఎండకి తెల్లగా ఎండిన బాటలు నేలలోనుంచి తిరిగి తిరిగి, అక్కడక్కడ మాయం అయిపోయి, మళ్లీ చెట్ల తోపులలో కనిపించేవి.

ఆపుకోలేక, అమాంతంగా అనేశాడు!

"ఇంటికి వచ్చేస్తున్నాను!" అతని ఇల్లు ఎక్కడో అతనికే తెలియదు. ఎప్పుడో చూసినట్లున్న ఒక సమాధి అవవచ్చు (తను చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు ఎక్కిన 'కారబోల' మీద నీరు చిలకరించిన నది మరోకసారి అతని కళ్లముందే ప్రవహించినట్లయింది.)

మెల్లిగా నడుచుకుంటూ, అడుగులు లెక్క వేస్తూ ముందుకి సాగిపోయాడు. నేలని కొలత వేస్తున్నట్లుంది అతని వాలకం. తన పళ్ల భారానికి గర్భిణివలె వంగిపోయినట్లు కనిపించింది ఒక జామచెట్టు — బాగా పండిపోయిన దానిని ఒకటి కోసి, చేతులతోనే చిదిమి, నోట్లో వేసుకున్నాడు. పళ్లులేని చిగుళ్లతో నమలటం ప్రారంభించాడు. మొదట కోపంతో చెట్లన్నిటినీ నరికి పారెయ్యాలనుకున్నాడు కాని, చెయ్యి ఎత్తలేకపోయాడు. ఆ ఘోరకృత్యం ఇతరుల చేతుల మీదుగానే జరగనీ అనుకున్నాడు.

అసలు ఈ గడ్డ ఇంకెన్ని రోజులు బ్రతుకుతుంది? అనుకున్నా ముందే ఎండిపోయి, చనిపోతుంది.

ఆకారం మాసిపోయి, చెట్లు, చీమలపుట్టలు కూడా నేలమట్టం అయిపోతాయి. వాటి స్థానంలో 'పతే' మొక్కలు నాటినట్లు, వరసలు వరసలుగా ఇళ్లు కట్టేస్తారు. సున్నం రాయి మిగల్చకుండా కొట్టుకుపోతారు. నేలని పూర్తిగా మట్టం చేసేస్తారు. నది పక్కనే ఉంది కాబట్టి — అక్కడ 'సేపా' తను బట్టలు ఉతకటం ఆగిపోతుంది — దానిని 'రివర్ సైడ్ పార్క్' అంటారు.

అంతా మారిపోతుంది, తను వారానికి ఒకసారి బస్తీలోకి పోయి కాన్వెంట్‌వారికి పాలు సరఫరా చేసేవాడు. జాగ్రత్తగా ప్రతి సీసా బిరడాని సర్ది స్వయంగా ఫాదరీకి ఇచ్చొచ్చేవాడు. ఇక పైన తను బస్తీలోనే ఉండిపోవాలి. తన కోడలితో బ్రతకాలి. ఈమెకి మెల్లకన్ను, తనని చూస్తే ఎప్పుడూ విసుగు. కాని, సేపా పండించిన పళ్లు, కూరగాయలు తీసుకొనటానికి మాత్రం సిద్ధం! సంతలో చేపల బుట్ట దగ్గర సేపా కూర్చుంటాడు. ఇకమీదట — బేరానికి వచ్చినవారు చేపలని వేళ్లతో చిదిమి, చెడగొట్టి వెళ్లిపోతారు. లేదా ఒక చిన్న గుడిసెలో పడేస్తారు. ఇది మరీ చిన్నదిగా ఉంటుంది. పక్క ఇళ్ల కంపు అంతా తన ఊపిరి తిత్తులని నింపేస్తుంది.

మాంగ్ అగుస్తోకి తన భార్య జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు ఆమె వయస్సు ముదిరి నోరంతా వదులుగా వేళ్లాడుతోంది. చేతులు చెట్ల వేళ్లలా ఎండిపోయాయి. అయినా సేము తక్కెడ నిండా బియ్యం పోసుకుని, తిరిగిపోయిన వేళ్లతో రాళ్లు ఏరుదామని ప్రయత్నిస్తుంది. ధాన్యంలో పొట్టుని తీసి పారెయ్యటానికి ప్రయత్నిస్తుంది. చేతులు తమ క్రమం తప్పి ధాన్యం ఏమయినా రాలుతుందేమో అని కోడిపిల్లలు ఆమె చుట్టూ తిరుగుతూ ఉంటాయి. నిజంగా ఆమెని తలుచుకుంటే జాలివేస్తుంది. ఇంతకుముందు కొన్ని సంవత్సరాలముందే కదా, సేపా, నెత్తిమీద బుట్ట పెట్టుకుని చక్కగా పొలంగట్లమీద నడిచి వెడుతూ ఉండేది. ఆమె బుజాలు నిండుగా మెరిసిపోతూ ఉండేవి. 'పతే' దంచేటప్పుడు ఆమె తల గర్వంగా పైకి ఎత్తిపట్టుకునేది. 'పిహోరా' లాగ. ఇప్పుడేమో తమ జీవితమంతా ముసలివాళ్లగానే గడిపామా అన్నట్లుంది. తను తొడుక్కున్న లాగూ కాళ్లకి బాగా వదులు అయిపోయింది. అసలు సేపా పిల్లలకి ఎప్పుడయినా పాలు ఇచ్చిందా అని సందేహం కలుగుతోంది. ఎప్పుడయినా 'చీమ పుట్టలో మనిషి' ని తన బిడ్డని తీసుకుపోవద్దని పాడుతుందా అనిపిస్తుంది. పెరుగుతున్న తన కడుపు మీద చెయ్యి వేసుకుని ఎండలో నుంచున్నదా ఎప్పుడయినా అసలు? ఇప్పుడు ఆమె ఎముకల గూడుమీద చర్మం వస్త్రం వలె వదులు వదులుగా వేళ్లాడుతోంది.

పాడుబడిన నుయ్యి ముందు ఆగాడు. కొంచెం ప్రొద్దెక్కినదేమో 'దుహాల్' చెట్టు నీడలు దాని మీద విచిత్రంగా పడుతున్నాయి. ఒకసారి ఆవుదూడ కట్లు తెంపుకుని వచ్చి అందులో పడిపోయింది. చాలారోజుల తర్వాత, అది చనిపోయి దుర్వాసన వెలువడిన తర్వాతనే తను చూశాడు. దానిని పూడ్చటం అనవసరం. ఆ చుట్టుపక్కల వారందరికీ అది ఎక్కడో తెలుసు. సేపా మాత్రం దానిని చూస్తే భయపడేది. చీమ పుట్టలు ఎంత ప్రమాదకరమో అంత ప్రమాదకరం అనేది.

అక్కడినుంచి 'విజిటా' దగ్గరకి వెళ్లాడు. ఇక్కడే సంవత్సరానికి ఒకసారి 'ఫాదరీ' వచ్చి 'మాస్' చెప్పి పిల్లలని 'బాప్టయిజ్' చేసి వెళ్లేవాడు. పిల్లలలో కొంచెం ఎదిగినవారికి 'వాక్సినేషన్' ఇప్పించేవారు. ఈ జాబితా వ్రాసే పొట్టి మనిషిని చూసి పకపకా ఏడిచేవారు. 'విజిటా' చాలా అశుభ్రంగా ఉంటుంది. ఎక్కడ చూసినా దుమ్ము, కోడిపిల్లల రెట్టలు. సేపా పెట్టెలో ఒక 'శాన్ వంటోనియో' (ఏంటోనీ సెయింట్ ప్రతిమ) ఉంది. ఇది ముదురు జేగురు రంగులో ఉంటుంది. కడిగి, కడిగి బాగా మెరుగు వచ్చింది. దానిని శుభ్రం చెయ్యటానికి బయటికి తీసినప్పుడల్లా పిల్లలు ఏడిచేవారు — అది 'చీమలపుట్ట మనిషి' అని వారి భయం.

సేపాతో అతని పెళ్లి బస్తీలో జరిగింది. మేయర్ పెళ్లి పెద్ద — అతనికి తన తండ్రి కోడిపుంజాలు కొన్ని ఇచ్చాడు. గంటలు మ్రోగించేందుకు డబ్బు లేదని తన తమ్ముడు చాలా బాధపడ్డాడు. రుసుము చెల్లించనిదే చర్చిలో మనిషి (సాక్రిస్టాన్) గంట వాయించనివ్వడు. అయినా వారు అతిగా కంగారుపడలేదు. మొత్తానికి రోజంతా సంతోషంగానే గడిచింది. చిన్న బండుతో పొలానికి తిరిగి వెళ్లిపోయారు. పొలంగట్లమీద వేగంగా పరుగెత్తారు.

నది నీరు తగ్గిపోయి ఇసుకలో పండిన 'కర్బూజా' పళ్లు దొరకవచ్చునని ఇంకా ముందుకి సాగిపోయాడు. కాని తీరా చూసేసరికి పచ్చిగానే ఉన్నాయి, వేరుశనగలు కూడా ఆకులు దట్టంగా

